# కథ నీలి మేఘాలలో.....

- నందిరాజు పద్మలతా జయరాం

పలుచగా వున్న గాలితెమ్మెరలకి, అలా అలా కదులుతున్న నీలి మబ్బుల్లో తేలుతూ, ఓసారి క్రిందికి చూశాను. బారులు, బారులుగా జనం, కార్లు, స్కూటర్లు, అక్కడా అక్కడా సైకిళ్ళు, ఎక్కడ, ఏ బండి కింద పడతామో అని బెదురు బెదురుగా నడుస్తున్న పాదచారులు, నాకు నవ్వొచ్చింది. నిన్నటి దాకా నేనూ ఇలాగే బతికాను. ఈ రోడ్లపైనే తిరిగాను. చంటిదాన్ని వేలు పుచ్చుకుని రోడ్ క్రాస్ చేయించినా, సుమతి జబ్బ పట్టుకుని సినిమాకు లాక్కెళ్ళినా ఈ రోడ్లమీదనే. బళ్ళని తప్పించుకుంటూ నడవటం గమ్యం చేరాక "హమ్మయ్య బతికాంరా నాయనా!" అనుకోవడం.

ఆహా! ఎంత తేలికగా వుందో శరీరం, చేతుల వెనుక భాగాన వున్న తెల్లటి రెక్కలు నన్ను రివ్వున ఎగరవేసుకు పోతున్నాయి. పాదాలు కొద్దిగా కదిలిస్తే చాలు కావల్సినంత ఎత్తులో ఎగరొచ్చు. చేతుల డైరెక్షన్ మార్చుకుంటూ, ఎటు కావాలంటే, అటు పోవచ్చు. అనుకోకుండా పుట్టుకొచ్చిన ఈ రెక్కల సౌఖ్యం ఎంత బావుందో!

మళ్లీ కిందికి చూశాను. దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతం. హు! ఒకప్పుడు అంటే పాతికేళ్ళ క్రితం ఇటు వైపుకి కాస్త పొద్దుపోయాక రావాలంటే ఎంతో ఆలోచించాల్సి వచ్చేది. ఎవరినైనా తోడు తీసుకుని రావాల్సిందే. ఎప్పుడో ఓ సారి కనిపించేది బస్సు, దానిని చూస్తే పుష్పకవిమానాన్ని చూసినంత ఆనందం. అది ఐరావతంలా కదులుతూ ఎప్పటికో ఇల్లు చేర్చేది. ఇప్పుడు మాత్రం, అడుగువేస్తే, తియ్యడం ఎలాగ అనిపించేంత జనం. అందుకు తగ్గట్టు బస్సులు. ఎంత మారిపోయింది. ఆలోచిస్తూ సాగుతున్నాను. బుజ్జి నిక్కర్లతో కవ్విస్తూన్న ముద్దుగుమ్మల విస్కీ అడ్వర్టయిజ్‌మెంట్ మహిళాసంఘాలకి అందకుండా పైకెక్కి కూచున్నా, నాకు మాత్రం దివ్యంగా కనిపిస్తోంది.

మరింత ముందుకి మలక్‌పేట దాటాను. అబ్బా! వీపు మీద దురదపెస్తోంది. ఛ్ ! ఎలా గోక్కోవటం? ఈ ఎగిరే అనుభూతి అద్భుతంగా వుంది గానీ, ఈ తీట తీర్చుకునే దారేది చెప్మా ! ఏ బస్సు టాపుమీదనో దిగితే! లాభం లేదు. ప్రతి బస్సు నిండి వున్న జనంతో ఓ ప్రక్కకి ఒదిగిపోయి నడుస్తోంది. లోపల కుదేసిన జనాన్ని, అడ్జస్ట్ చెయ్యడానికి డ్రైవర్లు వేసే సడెన్ బ్రేకులు, వాటి ప్రభావమూ నాకు బాగా తెలుసు. బస్సుపై నుండి క్రింద పడ్డానంటే ఏరుకోవడానికి కూడా ఎముక ముక్క మిగలదు, ష్ ! అబ్బా ! ఈ దురద కొద్ది కొద్దిగా క్రిందికీ, పైకీ కూడా పాకుతోంది. తప్పదు గోక్కోవాల్సిందే. ఎక్కడైనా ఏదైనా ఓ చెట్టు మీద వాలితేనో! ఉహూ! చెట్టుకాదు కదా, ఒక్క ఆకు కూడా కనిపించడం లేదు. అసలు నేను ఎగిరే దోవలో అడ్డొస్తున్న ఈ బిల్డింగులను తప్పుకుని సాగుతున్నాను. కదా! పోనీ, ఏ బిల్డింగు టాప్‌లోనో దిగి, ఆ కాస్త పని కానిస్తేనో! హమ్మో! కోరికోరి తెచ్చుకున్న ఈ రెక్కల్ని ఉత్తరించి, నన్ను ఉతికి పారెయ్యడం ఈ జనం, ఒద్దు బాబోయ్ వద్దు.

అదిగో ! ఛాదర్‌ఘాట్ వచ్చింది. కొత్త బ్రిడ్జీ మీద కాస్త జనం పల్చగా వున్నారు. అటు పోతే సరి. ఆ క్రిందుగా దండిగా అరటిచెట్లున్నాయ్. వాటి చాటున బోలెడు చాటుమాటు ప్రదేశం కూడా వుంది. అవును ఈ ప్రదేశం బాగుంది. నెమ్మదిగా దిగి చెట్ల మధ్యకుచేరాను. క్రిందంతా బురద, మహానగర ప్రజల విసర్జనలన్నీ ఇందులోనే చేరి చీటావాల అరటి పళ్ళని ప్రసాదిస్తుంటే, రుచులు ఆస్వాదిస్తూ మనం, ముక్కు మూసుకున్నాను. కళ్ళూ మూసుకున్నాను. ఇంతలో దురద, నేనున్నానంటూ ప్రత్యక్షమయింది. తనివి తీరా గోక్కుని కాళ్ళ బురదని మూసీలోనే కడుక్కుని మళ్లీ పైకి లేచాను. ఇంతలో ఎవడో, తాపీగా పనికానిస్తున్న కుర్రాడొకడు హాయ్ ! హాయ్ అని అరుస్తూ ఎగురుతున్న నన్ను చూసి అరవనారంభించాడు. అందరి కళ్ళూ పడేలోపలే అక్కడ నుండీ తప్పుకుని, రివ్వున ఎగురుతూ కోఠీ సర్కిల్ దగ్గరికొచ్చాను. వాహనాల పొగ నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. తెల్లగా కనిపించే మబ్బులనిండా దుమ్మూ, ధూళీ నిండిపోయివుంది. వాటిని దాటుకుంటూ, ఏ

భవిష్యత్కాలంపై ఒకరి నీడ ఎంత నిడివిగా, ఎంతదూరం పడుతుందనేది వారి గొప్పతనానికి తార్కాణం

విమానమో అడ్డొస్తే తప్పుకుంటూ సాగిపోతున్న నా గగన విహారం ఓ క్షణం ఆపాను. నేను నిన్నటివరకూ బస్సెక్కే సెంట్రల్ బ్యాంక్ బస్టాప్‌లో రెగ్యులర్ బిచ్చగాడు డబ్బులు లెక్కేసుకుంటున్నాడు. వాడికి కుడికాలు, ఎడమచెయ్యి కుంటి. దానికి సాయం గూని. రోడ్డుమీద విచిత్రంగా నడుస్తూంటాడు క ర్ర పోటేసుకుంటూ, ఒంటిచేత్తో పైసల మూట విప్పటం, కట్టడం, లెక్కెయ్యడం చూస్తూ బస్ కోసం ఎదురుచూడడం నా అలవాటు. అందుకే ఓసారి జేబులో చెయ్యిపెట్టి అందిన నాణెమేదో, ఆలోచించకుండానే సరిగా వాడి ఒళ్ళో పడేటట్లు విసిరేశాను.

అయ్యో! అది కాస్తా బస్టాపులో నిల్చున్న బట్టతల వాడి గుండుమీద ఠంగున పడిందే ! ఆ ! ఫర్లేదులే కుంటి బిచ్చగాడు దేక్కుంటూ వచ్చి ఆ నాణేన్ని అందుకున్నాడు. తల తడుముకుంటూ పైకి చూస్తున్న పెద్దమనిషికి కనిపించకుండా మబ్బుల్లో దాక్కుని, మళ్లీ ప్రయాణం సాగిస్తున్నాను.

అబిడ్స్ సర్కిల్ వచ్చింది. ఎవరో, ఏదో ఊరికే ఇస్తూంటే, క్యూ కట్టినట్లు జనం, ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర, క్రింది నుండి పైకి పాకుతూన్న శబ్దం చెవుల్లో హోరుగా వుంది. ఈ వాహనాల శబ్దాన్ని నేను ఇంత భయంకరంగా ఇంతకు పూర్వం ఫీలవలేదే !

నాంపల్లి స్టేషన్‌కెళ్ళే మూల మలుపులో పొంచి వున్నారు తెల్లచొక్కా పోలీసులు. ఈ వేళ ఎందుకో పొద్దున్నే కాపుకాసినట్లున్నారు. ఒక్కో వాహనాన్ని చెయ్యి చూపి ఆపటం, రాజాలా కూర్చున్న తమ హెడ్డు దగ్గరికి తీసికుని వెళ్ళడం చేస్తున్నారు.

"ఏది ! తియ్యి లైసెన్సు "

"ఇదిగో సర్ !" ఆర్‌సి బుక్కు తీసి చూపించాడు కుర్రాడు.

"ఇన్సూరెన్స్"

"అందులోనే వుందిసార్. రెన్యువల్ కూడా చేయించాను."

"పొల్యూషన్ ఫ్రీ సర్టిఫికేట్"

"ఇదుగోండి సార్. ఇంక వదిలెయ్యండి సార్ టైం అయిపోతుంది. అర్జెంటుగా ఇంటర్వ్యూకి అటెండ్ కావాలి". అడిగాడు కుర్రవాడు.

"ఇదిగో చలాను యాభై కట్టివెళ్ళు." చలాను రాస్తూనే అన్నాడు ఇనస్పెక్టర్.

"అదేంటిసార్. అన్నీ పర్‌ఫెక్ట్‌గానే ఉన్నాయికదా!" ఆశ్చర్యంగా అన్నాడు కుఱ్ఱాడు.

"అందుకే యాభై రూపాయలు. లేకుంటే ఇంకా ఎక్కువే అయ్యేది." చలాను చేతికి అందిస్తూ, మరో అభాగ్యుడి వైపు తిరిగాడు ఇన్‌స్పెక్టర్.

"ఇది చాలా అన్యాయం. నేనెందుకు కట్టాలి'. ఆక్రోశించాడు కుర్రవాడు.

"ఐసీ ! ఇదిగో రాజూ! ఆ కేస్ తీస్కో, బండి స్టేషన్‌కి చేర్చు. ఇంక నువ్వుపోవయ్యా !"

కుర్రవాడు నిశ్చేష్టుడై చూస్తుండగానే, బండి తాళం చెవులు అందుకుని, రెండోవాడి దగ్గరకు వెళ్ళాడు పోలీసు.

"అది కాదు సార్! నా బండీ... ప్లీజ్" కాళ్ళ బేరానికి వచ్చాడు కుర్రాడు.

"ఇదిగో ! నో మోర్ డిస్కషన్స్. వంద కట్టి బండి తీసుకుపో!" విసుగ్గా అన్నాడు హెడ్డు.

"అదేంటి ! ఇపుడేగా యాభై అన్నారు." బిక్క మొహం వేసాడు కుర్రాడు.

"ఇదిగో బాబూ! ఈ రేటు ఇంకా పెరగక ముందే వంద కట్టి వెళ్ళు. ఇవాళ టార్గెట్టు అయిదువేలు. ఇంకా పట్టాల్సిన పిట్టలున్నాయి. తొరగా తెమలకపోతే బండి స్టేషన్ కెళుతుంది. తర్వాత, నువ్వు తీరిగ్గా వచ్చి, నీ అదృష్టం బాగుంటే పార్టులు మిగిలితే పట్టికెళతావు. తర్వాత నీ ఇష్టం. అసలే మా సార్ యమా స్ట్రిక్టు." రహస్యంగా అన్నాడు పోలీసు.

కుర్రాడు జేబులో వందకి రెక్కలొచ్చాయి. ఏడుపు ముఖంతో మళ్ళీ ట్రాఫిక్‌లో కలిసి సాగుతున్నాడు.

"కుర్రవెధవ ! పాపం కొత్తగా బండి కొన్నట్లున్నాడు. బొత్తిగా ట్రాఫిక్ సెన్స్ లేదూ...... " అనుకుంటూ నా దారిని నేను ఎగురుతున్నాను.....

విశాలమైన అసెంబ్లీ రోడ్డు మీద రయ్యిన సాగుతున్నాను. అరంగుళం కూడా జాగా లేకుండా అమాంతం హత్తుకుని కూర్చున్న జీను ఫాంటు పిల్లతో మోటార్ సైకిల్ నడుపుతున్నాడు ఓ డింభకుడు.

వీడికి ఊపిరెలా ఆడుతోంది చెప్మా ! అని ఆకాశంలో ఆశ్చర్యపోతూండగానే మా ఆఫీసొచ్చేసింది. వేగం తగ్గింది నెమ్మదిగా ఆఫీసు బిల్డింగ్ పై భాగాన దిగాను.

"ఏంటి ? ఆ జుట్టేంటి ? అలా రేగిపోయింది. ఆ ఫాంటు, షర్టు అలా వేసుకొచ్చావేంటి ?" ఆశ్చర్యంగా అడిగాడు కిరణ్, నా కొలీగ్.

"ఈ రోజు సార్ ఆకాశంలో ఎగిరొచ్చారు. కదు సార్. " కిసుక్కున నవ్వింది నాగమణి.

ప్చ్ ! నా అవతారం ఓసారి టాయ్‌లెట్ అద్దంలో చూసుకుని వస్తే బాగుండేది జాగ్రత్తగా, రెక్కలు పీకి బ్రీఫ్ కేసులో దాచాను కానీ, మిగతా విషయాలు మర్చిపోయాను. కొంపదీసి, నా రెక్కల సంగతి వీళ్ళగ్గానీ తెలిసిపోయిందా ఏం?

" మా ఏరియా ట్రాఫిక్ గురించి మీకు తెలీదుకదా? అందుకే అలా అంటున్నారు." అంటూ నేనూ నవ్వేసి టాయ్‌లెట్ వైపుకి నడిచాను.

ఆఫీసులో కూర్చున్నంతసేపూ, నా దృష్టి వాచీ మీదే వుంది.

"ఆహా ! ఏం అనుభూతి ? అలా, అలా ఆకాశంలో షికార్లు కొడుతూంటే ఎంత ఆనందంగా వుందో ! ఒక్క పైసా ఖర్చు లేకుండా ఎక్కడికయినా తిరిగిరావచ్చు. ఎలాగైనా సరే ! ఈ రోజు ఒక ప్లాన్ తయారుచెయ్యాలి. తిరిగి రావల్సిన ప్రదేశాల లిస్టు తయారుచేసుకుంటే, లీవు పారేసి ఎంజాయ్ చేసి రావచ్చు."

ఎలాగో అయిదయింది అయినా నేను కదల్లేదు. ఆఫీసులో అందరూ వెళితే గానీ నా రెక్కల్ని బైటికి తీయలేను కదా !

ఆరుదాటాక మళ్ళీ మిద్దెమీదికి చేరి, రెక్కల్ని బయటకు తీసి, రెండువైపులా అమర్చుకున్నాను. చేతులు పైకి చాపి, పైకి ఎగిరాను. ఓసారి గట్టిగా ఊపిరిపీల్చి, మా ఇంటివైపు తిరిగాను.

అయ్యో ! ఇదేమిటి? ఇక్కడా ట్రాఫిక్ గోలేనా ? నాతూ పాటు ఇంకా చాలా మంది రెక్కలు కట్టుకుని ఎగురుతున్నారేంటి ? అందరికీ ఈ రెక్కల వరం ఎలా లభించింది? ప్చ్.... ఆకాశం అంతా మనుషుల్తో నిండిపోయిందేమిటి? అరె ! ఇక్కడ కూడా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లున్నారేమిటి ? జంటలు, జంటలుగా, ఒక్కొక్కరిగా రివ్వు రివ్వున ఎగిరిపోతున్న జనాల మధ్య ఇరుక్కు పోతున్నానే ! అదిగో కోఠీ సర్కిల్.

'రెక్కలు ! సార్ తీస్కోండి... కలర్ రెక్కలు. మల్టీ కలర్ రెక్కలు. ఇవి కొనండి సార్. రెండొందలే కావాలిస్తే నూటయాభై ఇచ్చి పట్టికెళ్ళండి." అరుస్తూ నాతో పాటే వాడూ ఎగురుతున్నాడు రెక్కలమ్ముకునే కుఱ్ఱవాడు. మిగిలిన వాళ్ళ అందమైన రంగుల రెక్కల ముందు నా తెల్లటి రెక్కలు కళావిహీనంగా అన్పిస్తున్నాయి బాధగా చూసుకుంటున్నాను.

"డాష్ !" ఎదురుగా వస్తున్న జీన్సుఫ్యాంటు పిల్ల ధనా మని ఢీకొట్టింది.

"రాస్కెల్ ! కళ్ళు కన్పిండం లేదూ! చూసుకుని ఎగరాలని తెలియదూ ! " నా చంప ఛెళ్ళుమనిపించింది.

"హబ్బా ! " ధాం మని కిందపడ్డాను.

"అబ్బబ్బ! ఏంటండీ మీరు ? ఇన్నేళ్లయినా మంచం మీద నుండి కిందపడడం తప్ప, సరిగ్గా నిద్రలేవలేరు కదా! లేవండి. పిల్లల్ని బళ్ళో దింపాలి. లేటయితే ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతారు." చెయ్యి అందించింది శ్రీమతి.

"ఫర్లేదులే ! నాకు రెక్కలున్నాయిగా" అంటూనే చేతులతో వీపు తడుముకున్నాను.

"హూ! నా రెక్కలు ముక్కలయ్యేట్లు పని చేసినా తెమలడం లేదు. లేచి మొహం కడిగి రండి కాఫీ ఇస్తాను. " రొటీన్ సుప్రభాతం చదువుతూనే, వంటగదిలోకి దారి తీసింది.

"ఏం బ్రతుకులో ! కలలో కూడా సరిగ్గా ఎగరలేం కదా !" నిట్టూరుస్తూనే బాత్‌రూం లోకి నడిచాను.

వివాదాన్ని అంతంచేసే వాదమే హితకరం - సమర్థ రామదాసు